TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 63 | పేజీలు : 06| వెల: రూ.3/- తెలంగాణ సోమవారం | జూన్ 15, 2026

## మెట్రో విస్తరణకు కిషన్ రెడ్డి మోకాలడ్డు




- కేసీఆర్, కేటీఆర్ కనుసన్నల్లోనే 'గంగాపురం' కుట్రలు
- కనీసం ఎన్ఓసీ ఇప్పించడంలోనూ కేంద్రమంత్రి పూర్తిగా విఫలం
- ఎల్ అండ్ టీకి రుణ బదలాయింపును అడ్డుకున్న పెద్దమనిషి
- సీఎం రేవంత్ రెడ్డి ఫైర్
- మోడీ హామీల లెక్క తేల్చండి..
- నేను రాజీనామాకు సిద్ధం
- కిషన్ రెడ్డి సవాల్‌పై ప్రతి సవాల్

2లో..

హైదరాబాద్ నగర రవాణా ముఖచిత్రాన్ని మార్చే మెట్రో రైలు రెండో దశ (ఫేజ్-2) విస్తరణను బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కై అడ్డుకుంటున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా తమకు నష్టం జరుగుతుందనే భయంతోనే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ ద్రోహానికి ఒడిగట్టారని ధ్వజమెత్తారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లక్ష్యంగా పదునైన విమర్శలు గుప్పించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్ రెడ్డి అడ్డుకోవడం వల్లే మెట్రో విస్తరణ నిలిచిపోయిందని స్పష్టం చేశారు.

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :**

## 19 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి పొంగులేటి ఆదేశం
- వాతావరణ శాఖ హెచ్చరికలతో అలర్ట్
- జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగానికి కీలక సూచనలు
- ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు



2లో..

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు రక్షణ చర్యలపై దృష్టి సారించింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల తీవ్రతను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాబోయే భారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలపై నిరంతరం నిఘా ఉంచాలని, క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. "ప్రజల ప్రాణాలతో పాటు వారి ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రథమ లక్ష్యం. వర్షాకాలం ముగిసే వరకు రెవెన్యూ అధికారులు, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి." అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

## ధాన్య సేకరణలో కేంద్రానిది ప్రేక్షక పాత్రే!



2లో..

- మద్దతు ధరలు ప్రకటించి చేతులెత్తేస్తోంది..
- తెలంగాణపై తీవ్ర వివక్ష..
- కేంద్రం తీరుపై మంత్రి తుమ్మల తీవ్ర ఆగ్రహం
- జొన్న, మొక్కజొన్నలను 'పీఎస్ఎస్' పరిధిలోకి తీసుకురావాలి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధరల విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర ప్రకటించి ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి కేంద్రం పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వ సౌకర్యాలు, గన్ని బ్యాగుల లభ్యత, కేంద్ర విధానాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ఫలితంగా కనీస ధరలు వస్తాయని ఆశగా సాగు చేసిన రైతాంగానికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణలో మోగిన బడిగంట..

- సందడిగా మారిన పాఠశాలలు!
- వేసవి సెలవుల తర్వాత బడిబాట పట్టిన విద్యార్థులు
- ఉచిత పుస్తకాల పంపిణీ..
- కొన్నిచోట్ల ఘన స్వాగతం, అల్పాహారం
- అమావాస్య ప్రభావం
- మొదటి రోజు పడిపోయిన హాజరు శాతం



2లో..

## సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు!



2లో..

- ఓపెన్ కాస్ట్‌ల విస్తరణతో సంస్థ ఉనికికే ప్రమాదం
- సంస్థకు ప్రభుత్వం తక్షణమే రూ.50 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి
- మంచిర్యాలలో 'బొగ్గుబాయిబాట'
- ప్రారంభించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత
- గనిలోకి వెళ్లి కార్మికుల కష్టాలను అడిగి తెలుసుకున్న నేత
- కార్మికుల హక్కుల కోసం 'హెచ్ఎంఎస్'తో కలిసి రాజీలేని పోరాటం

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, జూన్ 15, 2026

# తెలంగాణలో మోగిన బడిగంట..

- సందడిగా మారిన పాఠశాలలు!
- వేసవి సెలవుల తర్వాత బడిబాట పట్టిన విద్యార్థులు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దీర్ఘకాలిక వేసవి సెలవులు ముగియడంతో సోమవారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఇన్నాళ్లూ ఇళ్లకే పరిమితమైన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టారు. నూతన విద్యా సంవత్సరం (2026-27) మొదటి రోజు కావడంతో ఉదయమే విద్యార్థులతో ఆటోలు, బస్సులు రోడ్లపై రయ్‌మంటూ సందడి చేశాయి. కొత్త పుస్తకాలు, కొత్త దుస్తులు ధరించిన చిన్నారుల కేరింతలతో బోసిపోయిన పాఠశాలలన్నీ మళ్లీ కళకళలాడాయి. పాఠశాలలకు తొలిరోజు వచ్చిన విద్యార్థులకు పలుచోట్ల ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీతో పాటు నూతనంగా అల్పాహారాన్ని కూడా అందజేశారు. బడిగంట మోగినప్పటికీ తొలిరోజు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం భారీగా తగ్గింది. విద్యా సంవత్సరం ప్రారంభ రోజే 'అమావాస్య' రావడం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అమావాస్య రోజున కొత్త పనులు ప్రారంభించడం, చదువులు మొదలుపెట్టడం మంచిది కాదని మెజారిటీ తల్లిదండ్రులు భావించి పిల్లలను బడికి పంపలేదు. పోనీ మంగళవారం పంపుదామంటే.. మంగళవారాన్ని కూడా కొందరు అశుభంగా భావిస్తుండటంతో, బుధవారం నుంచి పిల్లలను స్కూళ్లకు పంపాలని తల్లిదండ్రులు యోచిస్తున్నారు. ఈ సెంటిమెంట్‌ను ముందే గమనించిన కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తమ రీఓపెన్ తేదీలను ఈ నెల 17 లేదా 19వ తేదీలకు మార్చుకోవడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా తక్కువ హాజరు నమోదైన తరుణంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఒక విచిత్రమైన ఘటన వెలుగుచూసింది. గీతానగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విభాగానికి సంబంధించి తొలిరోజు కేవలం ఒకే ఒక్క విద్యార్థిని బడికి హాజరైంది. తోటి క్లాస్‌మేట్స్ ఎవరూ రాకపోవడంతో ఆ విద్యార్థిని క్లాస్ రూమ్‌లో ఒంటరిగానే కూర్చోవాల్సి వచ్చింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎలాంటి సెంటిమెంట్లు ఉన్నప్పటికీ, బుధవారం నాటికి పాఠశాలలన్నీ పూర్తి స్థాయి హాజరుతో సాధారణ స్థితికి చేరుకుంటాయని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

# మెట్రో విస్తరణకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మోకాలడ్డు

- కేసీఆర్, కేటీఆర్ కనుసన్నల్లోనే 'గంగాపురం' కుట్రలు
- కనీసం ఎన్ఓసీ ఇప్పించడంలోనూ కేంద్రమంత్రి పూర్తిగా విఫలం
- ఎల్ అండ్ టీకి రుణ బదలాయింపును అడ్డుకున్న పెద్దమనిషి
- సీఎం రేవంత్ రెడ్డి ఫైర్
- మోడీ హామీల లెక్క తేల్చండి..
- నేను రాజీనామాకు సిద్ధం
- కిషన్ రెడ్డి సవాల్‌పై ప్రతి సవాల్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హైదరాబాద్ నగర రవాణా ముఖచిత్రాన్ని మార్చే మెట్రో రైలు రెండో దశ (ఫేజ్-2) విస్తరణను బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కై అడ్డుకుంటున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా తమకు నష్టం జరుగుతుందనే భయంతోనే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ ద్రోహానికి ఒడిగట్టారని ధ్వజమెత్తారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లక్ష్యంగా పదునైన విమర్శలు గుప్పించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్ రెడ్డి అడ్డుకోవడం వల్లే మెట్రో విస్తరణ నిలిచిపోయిందని స్పష్టం చేశారు.

### కేసీఆర్ డైరెక్షన్.. కేటీఆర్ స్కెచ్.. కిషన్ రెడ్డి అమలు!

కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్ రెడ్డికి హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి లేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టడం లేదని, కానీ కిషన్ రెడ్డి పూర్తిగా కేసీఆర్ కనుసన్నల్లోనే పనిచేస్తున్నారని ఆరోపించారు. "లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కేసీఆర్ లోపాయికారీగా సహకరించినందుకు, కిషన్ రెడ్డి ఇప్పుడు గురుదక్షిణ చెల్లిస్తున్నారు. కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్ రెడ్డి ఇక్కడ అమలు చేస్తున్నారు. కిషన్ రెడ్డికి అంత తెలివి లేదు, కేటీఆర్ చెప్పిందే ఆయన చేస్తున్నారు." అని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

### తెలంగాణపై ఇంత వివక్షా?

మెట్రో విస్తరణకు రూ. 40 వేల కోట్లు అవసరమని, కేంద్రం రూపాయి ఇవ్వకపోయినా కనీసం నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన 'ఎన్ఓసీ' అయినా ఇప్పించరా అని ముఖ్యమంత్రి నిలదీశారు. అహ్మదాబాద్, విశాఖపట్నం మెట్రోలకు నిధులు, అనుమతులు ఇచ్చిన కేంద్రం, హైదరాబాద్‌కు ఎందుకు ఆపుతోందని ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాకపోతే, రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చి ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్ అండ్ టీకి రూ.13,600 కోట్ల రుణం 4 శాతం వడ్డీకే మంజూరు చేయించామన్నారు. అయితే, "రేవంత్‌రెడ్డిని తేలికగా పని చేయిస్తే తెలంగాణలో బీజేపీకి పుట్టగతులు ఉండవు" అని సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌లకు కిషన్ రెడ్డి చెప్పి, ఆ లోన్ డబ్బులు ఎల్ అండ్ టీకి ట్రాన్స్‌ఫర్ కాకుండా అడ్డుకున్నారని సీఎం సంచలన



ఆరోపణ చేశారు.

### మోడీ రాజీనామా చేస్తే..

ఎన్నికల హామీల అమలుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విసిరిన రాజీనామా సవాల్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీల లెక్క తేల్చాలని డిమాండ్ చేశారు. దేశ యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ హామీ ఏమైంది? విదేశాల నుంచి నల్లధనం తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న మాటను ఎందుకు నిలబెట్టుకోలేదు?, హైదరాబాద్‌కు 2023లోనే రీజనల్ రింగ్ రోడ్డు ప్రకటించినా అది ఇంకా సాకారం కాలేదు. "ఈ కీలక హామీలను నెరవేర్చలేకపోయినందుకు ప్రధాని నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, నేను కూడా మరుక్షణమే నా కేబినెట్‌ను రద్దు చేసి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రతి సవాల్ విసిరారు. కిషన్ రెడ్డి ముందుగా మోదీ హామీలపై సమాధానం చెప్పి, ఆ తర్వాత తన రాజీనామా గురించి మాట్లాడాలని స్పష్టం చేశారు.

# 19 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి పొంగులేటి ఆదేశం
- వాతావరణ శాఖ హెచ్చరికలతో అలర్ట్
- జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగానికి కీలక సూచనలు
- ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు

( మొదటి పేజీ తర్వాత ... )

సమీక్షా సమావేశంలో భాగంగా మంత్రి అధికారులకు పలు మార్గదర్శకాలను జారీ చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాలను, వరద ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించాలి. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ 24 గంటలూ అందుబాటులో ఉండాలి. అత్యవసర పరిస్థితులు ఎదురైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

# సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు!

**మంచిర్యాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సింగరేణి సంస్థను ప్రైవేట్‌పరం చేయడానికి తెరవెనుక పెద్ద కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేసి, ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచుతూ సింగరేణి ఉనికిని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో వారం రోజుల పాటు సాగనున్న 'బొగ్గుబాయి బాట' కార్యక్రమానికి ఆమె సోమవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కాసిపేట మైన్-1ను సందర్శించిన కవిత, నేరుగా గనిలోకి వెళ్లి కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారి క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్మిక సదస్సులో కవిత మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంటే, వెంటనే సంస్థకు రావాల్సిన రూ. 50 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ కోసం విధానాలు రూపకల్పన చేయాల్సిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలే అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ కార్మిక రంగాన్ని మభ్యపెడుతున్నారని కవిత విమర్శించారు. "ఢిల్లీ, హైదరాబాద్‌లలో ఉండి సింగరేణికి కొత్త బొగ్గు బావులు తేవాల్సిన పాలకులు.. ఇక్కడికి వచ్చి కార్మికులకు వినతిపత్రాలు ఇస్తూ నాటకాలాడుతున్నారు. వారసత్వ (డిపెండెంట్) ఉద్యోగాల విషయంలో సింగరేణి బిడ్డలకు ప్రభుత్వం ఘోర అన్యాయం చేస్తోంది." అని కవిత విమర్శించారు. సింగరేణి సంస్థను, ఇక్కడి అండర్ గ్రౌండ్ మైన్లను కాపాడుకోవడానికి హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్)తో కలిసి సంయుక్తంగా పనిచేస్తామని కవిత స్పష్టం చేశారు. ఢిల్లీ స్థాయిలో, జేబీసీసీ లో కార్మికుల హక్కుల రక్షణ కోసం హెచ్.ఎమ్.ఎస్. కేంద్ర అధ్యక్షుడు రియాజ్‌తో కలిసి రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ కాలం నుండి తాము కార్మికులతోనే ఉన్నామని, కొత్త పార్టీ (టీఆర్ఎస్) స్థాపించాక సింగరేణిలో ఇదే తన మొదటి యాత్ర అని పేర్కొంటూ.. కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన తమకు సింగరేణి బిడ్డల ఆశీర్వాదం, దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని కవిత కాంక్షించారు.

# ధాన్య సేకరణలో కేంద్రానిది ప్రేక్షక పాత్రే!

- మద్దతు ధరలు ప్రకటించి చేతులెత్తేస్తోంది..
- తెలంగాణపై తీవ్ర వివక్ష..
- కేంద్రం తీరుపై మంత్రి తుమ్మల తీవ్ర ఆగ్రహం
- జొన్న, మొక్కజొన్నలను 'పీఎస్ఎస్' పరిధిలోకి తీసుకురావాలి

**( మొదటి పేజీ తర్వాత..)** కేంద్ర ప్రభుత్వం బాధ్యతల నుండి తప్పుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నా, రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో రూ.4,000 కోట్ల వ్యయంతో మొక్కజొన్న కొనుగోలు చేపట్టిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుండి 9.57 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించారు. రాష్ట్రంలో సాగవుతున్న జొన్న పంటను కూడా రూ.1,100 కోట్లతో సేకరించేందుకు ప్రభుత్వం సర్వసిద్ధంగా ఉంది. ప్రస్తుతం ప్రైస్ సపోర్ట్ స్కీమ్ పరిధిలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలుపై కేంద్రం విధిస్తున్న 25 శాతం సీలింగ్ పరిమితిని వెంటనే 50 శాతానికి పెంచాలని మంత్రి డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ విషయమై కేంద్ర వ్యవసాయ మంత్రికి మరోసారి లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, ఎంపీలు రాజకీయాలు పక్కనబెట్టి, ఈ సమస్యలపై కేంద్రంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సమీక్షలో భాగంగా కింది కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో 15.07 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు అవసరం కాగా, ప్రస్తుతం 11.40 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం మాత్రమే ఉంది. మిగిలిన 3.29 లక్షల మెట్రిక్ టన్నుల కోసం అదనపు గోదాములను వెంటనే గుర్తించాలి. మొక్కజొన్న కొనుగోళ్లకు 3 కోట్ల గన్ని బ్యాగులు అవసరం కాగా, ఇప్పటికే 2 కోట్లు సరఫరా అయ్యాయి. మిగిలిన కోటి బ్యాగులను తక్షణమే అందుబాటులోకి తేవాలి. కొనుగోలు కేంద్రాల్లో బరువు తూచడంలో ఆలస్యం జరగకూడదని, అప్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీలను, పంటను తరలించేందుకు తగినన్ని లారీలను సిద్ధంగా ఉంచాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలను మంత్రి తుమ్మల ఆదేశించారు.

# వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

- రైతులు ఎవరూ అధైర్యపడొద్దు..
- ప్రభుత్వం అండగా ఉంటుంది
- జిల్లాలో యూరియా కొరత లేకుండా సరఫరా
- కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
- పెద్దాపూర్, లక్ష్మాపూర్ వరి కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఇటీవల కురిసిన అకాల భారీ వర్షాల నేపథ్యంలో వరి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ శ్రీ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఉప్పునుంతల మండలంలోని పెద్దాపూర్, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. శనివారం కురిసిన భారీ వర్షాలకు వరి ధాన్యం తడిసిన విషయం తన దృష్టికి రావడంతో స్పందించిన కలెక్టర్.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు, తేమ శాతం, తూకం ప్రక్రియ, హమాలీల లభ్యత, రవాణా సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని ఎక్కువ కాలం కేంద్రాల్లోనే నిల్వ ఉంచకుండా వెంటనే బాయిల్డ్ మిల్లులకు తరలించాలని, ఇందుకోసం రవాణా ఏర్పాట్లను వేగవంతం చేయాలని సివిల్ సప్లైస్, ఐకేపీ, మెప్మా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా ధాన్యం నాణ్యత మరింత దెబ్బతినకుండా అదనపు టార్పాలిన్లు, కవర్లను అందుబాటులో ఉంచాలన్నారు. "ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉంది. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు." అని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రాల వద్ద కలెక్టర్ రైతులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ వానాకాలం సాగు సీజన్‌కు అవసరమైన యూరియా ఎరువుల కొరత లేకుండా చూడాలని రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ.. జిల్లాలో యూరియా కొరత తలెత్తకుండా ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. అవసరమైన నిల్వలను ముందుగానే సమకూర్చి, ప్రతి రైతుకూ సకాలంలో ఎరువులు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా వేగవంతంగా తూకాలు పూర్తి చేయాలి. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదు చెల్లింపులుసకాలంలో జరిగేలా చూడాలి. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగు సలహాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహా రావు, ఉప్పునుంతల తహసిల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ, మార్కెటింగ్, సివిల్ సప్లైస్ శాఖల అధికారులు, ఐకేపీ, మెప్మా ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# నాంపల్లి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు

- భక్తులకు పరిశుభ్రమైన, ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే ధ్యేయం
- ఆలయ ఈవో రమాదేవి ఆదేశాలతో ముమ్మరంగా సాగిన క్లీన్ అండ్ గ్రీన్ పనులు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ నాంపల్లి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.రమాదేవి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకు ఆలయ ప్రాంగణం, ప్రధాన దర్శన మార్గాలు, మెట్ల మార్గం, క్యూ లైన్లు, ప్రసాద విక్రయ శాలలు, మండపాలు, భక్తుల విశ్రాంతి ప్రాంతాలు, తాగునీటి కేంద్రాల వద్ద విస్తృతంగా శుభ్రత పనులు నిర్వహించారు. వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ తరుణంలో ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారకుండా ఉండేందుకు సానిటేషన్ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. చెత్త సేకరణ, వ్యర్థాల తక్షణ తొలగింపు, మరుగుదొడ్ల నిరంతర నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. నాంపల్లి గుట్ట ఆలయ పర్యవేక్షకులు జి.శ్రీనివాస్ శర్మ స్వయంగా క్షేత్రస్థాయిలో ఉండి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. భక్తులకు ఎక్కడా, ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని కోణాల్లో జాగ్రత్తలు తీసుకున్నారు. "ఆలయ పవిత్రతను, పరిశుభ్రతను కాపాడటంలో భక్తులు కూడా భాగస్వాములు కావాలి. పూజా సామాగ్రి, ప్లాస్టిక్ కవర్లు మరియు ఇతర వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా.. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిర్దేశిత డస్ట్‌బిన్‌లలోనే వేయాలి." అని ఆలయ అధికారులు అన్నారు. భక్తులకు స్వచ్ఛమైన దర్శన భాగ్యాన్ని కల్పించడంతో పాటు, ఆలయ వైభవాన్ని కాపాడేందుకు దేవస్థానం నిరంతరం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఇటువంటి మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు మున్ముందు కూడా నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ పారిశుధ్య డ్రైవ్‌లో ఆలయ సహాయ అధికారులు, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, కాంట్రాక్ట్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# వాహనాలు ఆపితే జరిమానా తప్పదు

- పాత బస్టాండ్ రోడ్లపై అడ్డంగా నిలిపితే చట్టపరమైన చర్యలు
- పోలీసుల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ
- లింగాల సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య

**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల కేంద్రమైన లింగాల పాత బస్టాండు ప్రాంగణంలోని బొడ్రాయి, అంబేద్కర్ విగ్రహం పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై వాహనాలు నిలిపితే ఇకపై జరిమానా తప్పదని స్థానిక సర్పంచ్ శ్రీమతి పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య స్పష్టం చేశారు. ఆదివారం పోలీస్ శాఖ సహకారంతో పాత బస్టాండ్ పరిసరాల్లోని వ్యాపారులకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, చలానాల విధింపు ప్రక్రియపై గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రధాన రహదారులపై ఉన్న దుకాణాలు, వ్యాపార సముదాయాలకు వచ్చే ప్రజలు తమ వాహనాలను రోడ్డుపైనే ఇష్టానుసారంగా నిలపడం వల్ల ప్రజా రవాణాకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గారి ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు పాత బస్టాండ్‌కు వచ్చి, ప్రయాణికులను ఎక్కించుకుని కొత్త బస్టాండ్ ద్వారా వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. బస్సుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి ఆదివారం పోలీసుల సహకారంతో గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. "ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి రహదారులపై అడ్డంగా వాహనాలు నిలిపి ఇబ్బంది కలిగిస్తే చట్టప్రకారంగా భారీ జరిమానాలు విధిస్తాం. వాహనదారులు ఎక్కడ పడితే అక్కడ కాకుండా.. గ్రామపంచాయతీ ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలోనే తమ వాహనాలను పార్కింగ్ చేయాలి." అని సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య సూచించారు. ఆర్టీసీ బస్సుల ప్రయాణానికి రూట్ క్లియర్ చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, వ్యాపార సముదాయాల యాజమాన్యాలు, కొనుగోలుదారులు మరియు వాహనదారులు గ్రామపంచాయతీ నిర్ణయానికి కట్టుబడి ఉండి సహకరించాలని సర్పంచ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శి, జీపీ సిబ్బంది, వార్డు సభ్యులు, స్థానిక వ్యాపారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

- విద్యాసంస్థల ధనదాహానికి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు బలి
- స్కూల్ క్యాంపస్‌లలో పుస్తకాలు, యూనిఫామ్‌ల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి
- సామాజిక ఉద్యమకారుడు రాజశేఖర శర్మ డిమాండ్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజులను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే "ఫీజుల నియంత్రణ చట్టం" తీసుకురావాలని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు వావిలాల రాజశేఖర శర్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా వ్యాపారమే పరమావధిగా సాగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల ధనదాహానికి సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులు బలైపోతున్నారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఫీజుల పేరుతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు. విద్యా ప్రమాణాలను పెంచడం పక్కన పెట్టి, కేవలం లాభార్జనే ధ్యేయంగా విద్యాసంస్థలను నడుపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా, విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల ప్రాంగణాల్లోనే విక్రయాలు జరుపుతూ ప్రైవేట్ యాజమాన్యాలు దోపిడీకి తెరలేపాయని రాజశేఖర శర్మ ధ్వజమెత్తారు. పాఠశాలల లోపలే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, టై, బెల్ట్, యూనిఫామ్‌లను విక్రయిస్తూ.. బయట మార్కెట్ కంటే రెట్టింపు ధరలకు వాటిని కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం అన్యాయమన్నారు. కళ్ల ముందే ఇంతటి బహిరంగ దోపిడీ జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. సామాన్యుడికి విద్యను దూరం చేస్తున్న ఇటువంటి వ్యాపార ధోరణిపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి, తనిఖీలు చేపట్టాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను క్రమబద్ధీకరించడానికి తక్షణమే ఒక బలమైన 'ఫీజు నియంత్రణ చట్టాన్ని' అమలు చేయాలి. నిబంధనలు ఉల్లంఘించి స్కూల్ క్యాంపస్‌లలో పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి పాఠశాలలో ఫీజుల వివరాలను, ప్రభుత్వ నిబంధనలను పారదర్శకంగా భక్తులకు/ప్రజలకు కనిపించేలా నోటీస్ బోర్డులపై ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం, విద్యాశాఖ ఇప్పటికైనా స్పందించి కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని వావిలాల రాజశేఖర శర్మ గట్టిగా డిమాండ్ చేశారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
సోమవారం, జూన్ 15, 2026

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

## విద్యార్థి సంఘం నేత డ్యాగ అనిల్ కుమార్



**నాగర్‌కర్నూల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జిల్లావ్యాప్తంగా అనేక ప్రైవేట్ పాఠశాలలు విద్యను సేవగా కాకుండా పక్కా వ్యాపారంగా మార్చి, విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్నాయని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీ డ్యాగ అనిల్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఫీజులను ఇష్టానుసారంగా పెంచుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలపై వేల రూపాయల అదనపు భారం మోపుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా డ్యాగ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా చార్జీలు, ప్రత్యేక కోచింగ్, డిజిటల్ క్లాసులు వంటి రకరకాల పేర్లతో విద్యార్థుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. కొన్ని కార్పొరేట్ పాఠశాలలు కేవలం 6వ తరగతి నుంచే ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సుల పేరుతో విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి పెంచుతూ, వారి సహజసిద్ధమైన బాల్యాన్ని నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును పెట్టుబడిగా చూసే విద్యా మాఫియాపై ప్రభుత్వం వెంటనే ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న యాజమాన్యాల గుర్తింపును రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. “విద్య అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు–అది వ్యాపారం కాదు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి ‘ఫీజు నియంత్రణ చట్టం’ తీసుకురావాలి. లేనిపక్షంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి వ్యతిరేకంగా బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు చేపడతాం.” అని డ్యాగ అనిల్ కుమార్ హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో, తల్లిదండ్రుల శ్రమతో చెలగాటమాడే ఏ ప్రైవేట్ విద్యాసంస్థ యాజమాన్యాన్ని కూడా ప్రభుత్వం ఉపేక్షించకూడదని ఈ సందర్భంగా ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.

# శ్రీ ఉమామహేశ్వరుడిని దర్శించుకున్న కలెక్టర్

- కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు..
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ ఈఓ, అర్చకులు
- దక్షిణ కాశీలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, జిల్లా సస్యశ్యామలం కావాలని ప్రత్యేక ప్రార్థనలు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నల్లమల ప్రకృతి సోయగాల నడుమ వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ ఉమామహేశ్వర దేవస్థానాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలకు చేరుకున్న కలెక్టర్ దంపతులు, వారి తల్లిదండ్రులకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, అర్చకులు, ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన ప్రత్యేక అర్చనలు, అభిషేక పూజలలో వారు కూర్చున్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని, వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం లబ్ధి పొందాలని, నాగర్‌కర్నూల్ జిల్లా అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు కలెక్టర్ తెలిపారు. దర్శనానంతరం ఆలయ మండపంలో అర్చకులు కలెక్టర్, వారి తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం శాలువాలతో ఘనంగా సత్కరించి ఆలయ విశిష్టతను వివరించారు.



“నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఈ ఉమామహేశ్వర క్షేత్రం ‘దక్షిణ కాశీ’గా అత్యంత ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏటా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తరిస్తారు.” అని ఆలయ అర్చకులు తెలిపారు. స్వామివారి దర్శనం అనంతరం కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు అందుతున్న తాగునీరు, వసతి తదితర కనీస సౌకర్యాల గురించి ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు సేకరించారు. ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక ప్రశాంతత, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం సందర్శన తమ కుటుంబ సభ్యులందరికీ ఒక మరుపురాని ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, అర్చక బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం గట్టు తుమ్మెం గ్రామంలో రైతుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు.. గ్రామ సర్పంచ్ వంగ బాల్ నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఓబీసీ చైర్మన్ వంగ గిరివర్ధన్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ఈ కొనుగోలు కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వంగ బాల్ నారాయణ గౌడ్ మరియు ఓబీసీ చైర్మన్ గిరివర్ధన్ గౌడ్ సంయుక్తంగా మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకే విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మడం రైతులకు ఎంతో లాభదాయకమన్నారు. “ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.



వర్షానికి తడిసిన వడ్లను సైతం ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం. తమ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి తక్షణమే ధాన్యం సేకరణ పనులు ప్రారంభించేలా చొరవ తీసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో రాజవర్ధన్, గ్రామ ఉపసర్పంచ్ ఆవంచ మహేష్, మాజీ ఉపసర్పంచ్ మధు గౌడ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘాల ప్రతినిధులు, పరిసర ప్రాంతాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గూడూరు మధును పరామర్శించిన చల్మెడ



వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : వేములవాడ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ 25వ వార్డు సీనియర్ నాయకులు గూడూరు మధు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం మధును వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా గూడూరు మధు ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే వివరాలను చల్మెడ లక్ష్మీనరసింహారావు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. చల్మెడ లక్ష్మీనరసింహారావు వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, క్రాంతి కుమార్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, నీలం శేఖర్, అంజద్ పాషా, సుంకపాక్ రాజు, కటకం మల్లేశం, వెంకట్ రెడ్డి, మంత సందీప్, ప్రేమ్ చారి, గోపు మధు, రావికంటి సాయి తదితర ముఖ్య నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# ఆటో డ్రైవర్ నిజాయితీ

- ప్రయాణికుడి బ్యాగు భద్రంగా అప్పగింత



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నేటి సమాజంలో ఇంకా మానవత్వం, నిజాయితీ సజీవంగానే ఉన్నాయని అచ్చంపేటలోని రామ్ రహీం లోకల్ ఆటో యూనియన్ సభ్యులు నిరూపించారు. ఆటోలో ప్రయాణికులు మరిచిపోయిన నగదు, విలువైన పత్రాలు ఉన్న బ్యాగును వెతికి పట్టుకుని, బాధితులకు అప్పగించి తమ ఉదారతను చాటుకున్నారు. అయ్యప్ప టెంపుల్ సేవా సమితి అధ్యక్షులు కపిలవాయి మహేష్ చారి ఆధ్వర్యంలో ఆలయ పనుల నిమిత్తం బీహార్ రాష్ట్రం నుంచి కొంతమంది కార్మికులు అచ్చంపేటకు విచ్చేశారు. వారు స్థానిక కొత్త బస్టాండులో దిగి, అక్కడి నుండి రామ్ రహీం లోకల్ ఆటో యూనియన్‌కు చెందిన ఒక ఆటోలో ఎక్కి అయ్యప్ప ఆలయానికి చేరుకున్నారు. అయితే, ఆలయం వద్ద దిగే క్రమంలో సదరు కార్మికులు పొరపాటున తమ బ్యాగును ఆటోలోనే మరిచిపోయారు. ఆ బ్యాగులో కొంత నగదు డబ్బులు, గుర్తింపు కార్డు, బట్టలు, మరికొన్ని ముఖ్యమైన విలువైన కాగితాలు ఉన్నాయి. బ్యాగు పోయినట్లు గుర్తించిన ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేష్ చారి.. వెంటనే రామ్ రహీం ఆటో యూనియన్ అధ్యక్షుడు మహబూబ్ అలీకి ఫోన్ ద్వారా సమాచారం అందించి సహాయం కోరారు. మహేష్ చారి నుంచి ఫోన్ రాగానే ఆటో యూనియన్ అధ్యక్షుడు మహబూబ్ అలీ తక్షణమే అప్రమత్తమయ్యారు. రామ్ రహీం లోకల్ ఆటో న్యూ బస్టాండ్ అంతర్గత గ్రూపులో సమాచారాన్ని చేరవేశారు. దీంతో యూనియన్ కోశాధికారి, ఆటో డ్రైవర్ అయిన అఖిల్ తన ఆటోను పరిశీలించగా.. వెనుక సీట్లో ప్రయాణికులు మరిచిపోయిన బ్యాగు లభ్యమైంది. బ్యాగు సురక్షితంగా ఉందని అఖిల్ వెంటనే యూనియన్ అధ్యక్షుడికి తెలపగా.. ఆయన ఆలయ కమిటీకి సమాచారం ఇచ్చారు. అనంతరం బాధితులు యూనియన్ ప్రతినిధుల వద్దకు వచ్చి తమ బ్యాగును పత్రాలతో సహా భద్రంగా తిరిగి తీసుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక సేవాభావంతో తక్షణమే స్పందించిన ఆటో యూనియన్ అధ్యక్షుడు మహబూబ్ అలీకి, ఆటో డ్రైవర్ అఖిల్‌కు, యూనియన్ సభ్యులందరికీ కపిలవాయి మహేష్ చారి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రతినిధులు మహబూబ్ అలీ, అషు, అఖిల్, వెంకటేష్, ఉస్మాన్, చందు, చౌకత్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, జూన్ 15, 2026

# రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు..

- కేంద్ర, రాష్ట్రాలు కలిస్తేనే అభివృద్ధి!
- గత ప్రభుత్వ మూర్ఖపు పాలన వల్లే తెలంగాణకు తీవ్ర నష్టం
- రేవంత్ రెడ్డి సహకారంతోనే కేంద్రం నుంచి భారీగా నిధులు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- వేములవాడ - సిరికొండ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వంద భారత్ :** "రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయి.. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ మూర్ఖత్వం, సోయి లేని పాలన వల్ల తెలంగాణ చాలా నష్టపోయిందని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ ప్రతిపాదనలు పంపుతుండటం వల్లే కేంద్రం నుండి నిధులు వెల్లువెత్తుతున్నాయని ఆయన వెల్లడించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం బొల్లారం గ్రామానికి విచ్చేసిన కేంద్ర మంత్రి.. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ తో కలిసి రూ. 23 కోట్ల సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధులతో చేపట్టనున్న వేములవాడ – సిరికొండ (బొల్లారం నుండి సిరికొండ వరకు) 18.21 కిలోమీటర్ల రహదారి విస్తరణ, బలోపేత పనులకు అధికారికంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీజేపీ నేతలు ప్రతాప రామకృష్ణ, చెన్నమనేని వికాస్ రావులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఈ రోడ్డు విస్తరణ పనులను ఒప్పందం ప్రకారం 6 నెలల గడువులోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా రహదారి విస్తరణతో పాటు మధ్యమధ్యలో సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్లు, పైప్ కల్వర్టులు, గ్రామాల పరిధిలో సీసీ డ్రైన్లు, రోడ్డు భద్రతా చర్యలు చేపడతారన్నారు. దీనివల్ల మామిడిపల్లి, బావుసాయిపేట, రామన్నపల్లి, గోవిందరావుపేట తండాల ప్రజలకు, వాహనదారులకు ప్రయాణ సమయం ఎంతో ఆదా అవుతుందని పేర్కొన్నారు.

ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత గెలిపించిన ప్రజల కోసమే తన శ్వాస, ధ్యాస అని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గత ఏడేళ్లలో తాను రూ. 22 వేల కోట్లకు పైగా కేంద్ర నిధులు తీసుకువచ్చానని, గతంలో ఏ ఎంపీ కూడా ఈ స్థాయిలో నిధులు తెచ్చిన దాఖలాలు లేవని గుర్తుచేశారు. తీసుకొచ్చిన నిధుల్లో కేవలం రోడ్ల నిర్మాణం కోసమే రూ. 10,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని వివరించారు. రూ.5,000 కోట్లతో నేషనల్ హైవేల విస్తరణ జరుగుతోందన్నారు. ఇందులో రూ. 2,147 కోట్లతో కరీంనగర్–వరంగల్ హైవే, రూ. 578 కోట్లతో ఎల్కతుర్తి–సిద్దిపేట హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన కరీంనగర్–జగిత్యాల రోడ్డు విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, ఇందుకోసం రూ. 2,300 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ విషయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఢిల్లీకి వచ్చి కేంద్ర మంత్రిని కలవడంలో పూర్తిగా సహకరించారని కొనియాడారు. "కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే వివక్ష మాకు లేదు. ఓటేసిన ప్రజల ఆకాంక్షల మేరకు అందరం చేయి చేయి కలుపుదాం. స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌ను దేశంలోనే 'మోడల్ నియోజకవర్గం'గా తీర్చిదిద్దుతాం. ఇందుకోసం కలిసి రావాలని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులను కోరుతున్నాను." అని బండి సంజయ్ కుమార్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామగ్రామాన, గల్లీగల్లీలో రోడ్లు వేయించి నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రమాదం అంచుల్లో 'చౌటపల్లి' పాఠశాల

- ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన గోడలు, వంటగది
- ఏడు తరగతులకు ఉన్నవి కేవలం రెండు గదులే..
- పెచ్చులు ఊడుతున్న స్లాబ్..
- విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఏది?
- తక్షణమే స్పందించాలని తల్లిదండ్రుల డిమాండ్

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి చూస్తే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వేసవి సెలవుల అనంతరం సోమవారం బడులు పునఃప్రారంభమైనప్పటికీ.. పాఠశాల గదుల గోడలు కూలిపోయి ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుండి ఏడవ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. మొత్తం ఏడు తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ, అందుబాటులో ఉన్న గదులు మాత్రం కేవలం రెండే కావడం గమనార్హం. దీంతో ఒకే గదిలో వేర్వేరు తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టి,



ప్రమాదపు అంచుల్లోనే ఉపాధ్యాయులు బోధన సాగించాల్సి వస్తోంది. తరగతి గదుల పైకప్పు సైతం పెచ్చులు ఊడి కింద పడుతుండటంతో పిల్లల రక్షణ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాలలోని వంటగది కూడా పూర్తిగా కూలిపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండటం, వడ్డించడం కష్టంగా మారింది. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న మాట్లాడుతూ.. "ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తరగతి గదులతో పాటు వంటగది కూడా కూలిపోయింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం అత్యంత క్లిష్టంగా మారింది." అని హెడ్ మాస్టర్ స్వప్న అన్నారు. పాఠశాల ప్రారంభమైన మొదటి రోజే ఇలాంటి భయానక వాతావరణంలో పిల్లలను చదివించాల్సి రావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకముందే.. విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి, చౌటపల్లి పాఠశాలకు సురక్షితమైన కొత్త తరగతి గదులను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు ఆటంకం కలగకుండా చదువుకునే వాతావరణం కల్పించాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# మహాకవి శ్రీశ్రీ సదా చిరస్మరణీయుడు

- అల్పాక్షరాలతో అనల్పార్థాన్ని సృష్టించిన మేటి
- వేములవాడలో 43వ వర్ధంతి వేడుకలు

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అల్పాక్షరాలతో అనల్పార్థాన్ని సృష్టించడంలో మహాకవి శ్రీశ్రీ మేటి అని వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ కొనియాడారు. సోమవారం పాఠశాల ఆవరణలో మహాకవి శ్రీశ్రీ 43వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. "ఆశ మనిషిని బతికిస్తుంది.. అక్షరం మనసును కదిలిస్తుంది.. తలుచుకుంటే ప్రపంచాన్ని శాసిస్తుంది" అనే మాటలను తన అక్షరాలతో నిజం చేసి చూపించిన యుగకర్త శ్రీశ్రీ అని శ్లాఘించారు. సాంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించి, వచన కవిత్వంలో శ్రీశ్రీ రచించిన 'మహాప్రస్థానం' తెలుగు సాహిత్యంలోనే ఒక మైలురాయిగా నిలిచిందని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ గ్రంథం ద్వారా ఆయన తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడిని సృష్టించి, అభ్యుదయ విప్లవ కవిత్వానికి ఊపిరి పోశారన్నారు. ప్రముఖ కవి, హేతువాది, నాస్తికుడు, విప్లవ కవి అయిన శ్రీశ్రీ.. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం (విరసం) స్థాపక అధ్యక్షుడిగా తెలుగు సాహిత్య రంగాన్ని నడిపించారని గుర్తుచేశారు.



"సమాజంలో పీడిత వర్గాల అభ్యున్నతి కోసం తన కలాన్ని ఆయుధంగా మలిచిన చైతన్య మూర్తి శ్రీశ్రీ." అని ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీశ్రీ ఏప్రిల్ 30, 1910న విశాఖపట్నంలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లి మరణించడంతో సవతి తల్లి సుభద్రమ్మ పెంపకంలో పెరిగారు. వ్యవహారిక భాషోద్యమంలో చురుగ్గా పాలుపంచుకున్నారు. పాత్రికేయ వృత్తిలో రాణిస్తూ 'ఆంధ్రప్రభ' పత్రికలో సబ్ ఎడిటర్‌గా, ఆకాశవాణిలోనూ సేవలు అందించారు. వెండితెరపై ఆయన కలం నుంచి జాలువారిన 'పాడవోయి భారతీయుడా.. ఆడవోయి ఆంధ్రుడా', 'జగమంత కుటుంబం నాది', 'తెలుగువీర లేవరా' వంటి ఎన్నో అద్భుతమైన గేయాలు సమాజంలో విప్లవాత్మక మార్పులు, చైతన్యాన్ని తెచ్చాయని కొనియాడారు. సమాజ మార్పు కోసం నిరంతరం తపించి, జూన్ 15, 1983న తుదిశ్వాస విడిచిన శ్రీశ్రీ సదా చిరస్మరణీయులని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడీ టీచర్లు లిక్కిడి మంజుల, పులి శారద, పాఠశాల విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు.

# ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలి

- మంత్రి సీతక్కకు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ వినతి
- హైదరాబాద్‌లో కలిసిన నియోజకవర్గ వీఓఏల ప్రతినిధి బృందం
- వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రి దృష్టికి..

**బల్మూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో అత్యంత కీలక భూమిక పోషిస్తున్న ఐకేపీ వీఓఏల సమస్యల పరిష్కారానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మరోసారి తన ప్రత్యేక చొరవను చాటుకున్నారు. అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన వీఓఏల ప్రతినిధి బృందంతో కలిసి ఆయన హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీఓఏలు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న





వీఓఏల ఇబ్బందులను ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మంత్రి సీతక్కకు సుదీర్ఘంగా వివరించారు. ముఖ్యంగా వీఓఏల కష్టానికి తగ్గట్టుగా వేతనాలను సవరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వీఓఏలకు కనీస ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీఓఏల విధులకు సంబంధించి స్పష్టమైన సేవా నిబంధనలు (సర్వీస్ రూల్స్) రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వీఓఏలు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని, వారి సమస్యలను మానవతా దృక్పథంతో ఆలోచించి తక్షణ పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ మంత్రిని కోరారు. "క్షేత్రస్థాయిలో ఐకేపీ వీఓఏలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు." అని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో తమ సమస్యలను నేరుగా మంత్రి దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభించడం పట్ల నియోజకవర్గ ఐకేపీ వీఓఏల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
సోమవారం, జూన్ 15, 2026

# దేవరకొండ ఫౌండేషన్ చేయూత



**పదో తరగతి విద్యార్థులకు నగదు పురస్కారాలు**

**నటుడు విజయ్ దేవరకొండ, రష్మికల చేతుల మీదుగా అందజేత**

**అచ్చంపేటలోని 45 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లబ్ధి**

**ప్రతిభను ప్రోత్సహిస్తేనే సమాజం అభివృద్ధి**

**సినీ నటుడు విజయ్ దేవరకొండ**

**విద్యాభివృద్ధి సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని వెల్లడి**



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, జీవితంలో అగ్రస్థానాలకు చేరుకోవాలని ప్రముఖ తెలుగు సినీ నటుడు, అచ్చంపేట వాసి విజయ్ దేవరకొండ పిలుపునిచ్చారు. 'ది దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నగదు పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం తుమ్మన్‌పేట గేట్ సమీపంలోని బీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ వేడుకలో విజయ్ దేవరకొండతో పాటు ప్రముఖ కథానాయిక రష్మిక మందన్న ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.

## సొంత గడ్డపై విద్యాసేవ..

ఈ సందర్భంగా సినీ నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. తన తల్లిదండ్రుల ప్రేరణతోనే సామాజిక సేవా రంగంలోకి అడుగుపెట్టానని, తన సొంత ప్రాంతమైన అచ్చంపేట డివిజన్ విద్యార్థులకు ఈ రకమైన ప్రోత్సాహకాలు అందించడం ఎంతో తృప్తినిస్తోందన్నారు. "ప్రతిభను ప్రోత్సహిస్తేనే సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం అచ్చంపేటలో ప్రారంభించిన ఈ విద్యా సేవలను రాబోయే రోజుల్లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాం." అని సినీ నటుడు విజయ్ దేవరకొండ తెలిపారు. తల్లిదండ్రులు, గురువులే విద్యార్థులకు అసలైన ప్రేరణ అని, వారు క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా పిల్లల్లో పెంపొందించాలని సూచించారు. కష్టపడి చదివి ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు వారి వెనుక ఉన్న తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## 180 మంది విద్యార్థులకు..

అచ్చంపేట డివిజన్ పరిధిలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో 9వ, 10వ తరగతుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 180 మంది విద్యార్థులకు ఫౌండేషన్ తరపున కింద పేర్కొన్న విధంగా నగదు పురస్కారాలు అందజేశారు: ప్రథమ ర్యాంక్ విద్యార్థులకు: రూ. 10,000 చొప్పున నగదు చెక్కులు. ద్వితీయ ర్యాంక్ విద్యార్థులకు: రూ. 5,000 చొప్పున నగదు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలు విద్యార్థులకు స్వయంగా చెక్కులను అందజేసి, వారితో కలిసి ఫోటోలు దిగుతూ సందడి చేశారు. తమకు ఆర్థిక చేయూతను అందించిన నటీనటులకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రముఖుల సమక్షంలో వేడుక..

ఈ విద్యా పురస్కారాల మహోత్సవ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ తల్లిదండ్రులు మాధవి, గోవర్ధన్ రావు, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమ నిర్వహణలో ఫౌండేషన్ మేనేజర్లు కన్నారావు, చాంద్, తుమ్మన్‌పేట రామ్మోహన్ రావులు కీలకంగా వ్యవహరించి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :



